# జన గణనతోపాటే కులగణన

- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
- కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకి
- ఆ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంది
- కాంగ్రెస్ రాష్ట్రాల్లో జరిగింది కులగణన కాదు సర్వే
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- కులగణన పారదర్శకంగా నిర్వహిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో చేపట్టనున్న జనాభా లెక్కల సేకరణలోనే కులగణనను కూడా చేర్చాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రకటించింది. ప్రతిపక్ష పార్టీలు కులగణనను తమ రాజకీయ స్వార్థం కోసం వాడుకుంటున్నాయని విమర్శించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కాంగ్రెస్‌తోపాటు పలు ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రధాన ఎన్నికల అంశంగా దీన్ని మార్చాయి. తెలంగాణతోపాటు బీహార్, కర్ణాటకలో ఇప్పటికే వెనుకబడిన కులాల సర్వే నిర్వహించారు. కర్ణాటకలో కులగణనపై వొక్కలిగ, లింగాయత్‌కు చెందిన వారు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముంగిట కేంద్రం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

**కులగణన కేంద్ర అంశం**

జనగణన, కులగణన అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. కొన్ని రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు కులగణన పేరిట సర్వేలు చేయించాయని, ఆ సర్వేల్లో పారదర్శకత లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ప్రక్రియ సమాజం సందేహాలను రేకెత్తించిందని అన్నారు. స్వాతంత్ర్యానంతరం పలుమార్లు జరిగిన జనగణనలో ఎన్నడూ కులగణనను చేర్చలేదని ఆయన గుర్తుచేశారు. కులగణనకు బద్ధ వ్యతిరేకి అయిన కాంగ్రెస్ ఆ అంశాన్ని తన రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నదని విమర్శించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, రాజకీయాల కారణంగా సామాజిక నిర్మాణం చెదిరిపోవద్దన్న ఉద్దేశంతో సర్వేలకు బదులుగా కులగణనను జనాభా లెక్కల్లో చేర్చాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. కులగణన ద్వారా దేశ సామాజిక, ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని, దేశం మరింత పురోగతి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాలతో కులాల సర్వే నిర్వహించారని ఆరోపించారు. తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా నిర్వహించాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియను 2020 ఏప్రిల్‌లోనే చేపట్టాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. పదేండ్లకోసారి చేపట్టే జనగణనను సకాలంలో నిర్వహించి ఉంటే 2021 నాటికి పూర్తి వివరాలు వెల్లడయ్యేవి.

**కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకం**

కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణనకు ఎన్నడూ మద్దతివ్వలేదని అశ్వినీ వైష్ణవ్ ఆరోపించారు. కులగణన అంశంపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయిస్తామని 2010లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ లోక్‌సభలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ తరువాత పలు రాజకీయ పార్టీలు కులగణన చేపట్టాలని సిఫారసు చేయడంతో మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అయినప్పటికీ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు బదులుగా సర్వేలు మాత్రమే చేయాలని నిర్ణయించిందని విమర్శించారు. కాంగ్రెస్‌తోపాటు దాని ఇండియా కూటమిలోని పార్టీలు కులగణన అంశాన్ని రాజకీయ అస్త్రంగానే వాడుకున్నాయని దుయ్యబట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం 'జనగణన' అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వస్తుందని చెప్పారు. కానీ కొన్ని రాష్ట్రాలు రాజకీయ కోణంలో ఎటువంటి పారదర్శకత లేకుండా కులాలను లెక్కించడానికి సర్వేలు నిర్వహించాయని అన్నారు. అతిత్వరలో జనగణన చేపడతామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గత ఏడాది చివరిలో ప్రకటించినప్పటికీ ఆ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారన్న దానిపై మాత్రం ఇప్పటివరకు స్పష్టత రాలేదు.



**స్వాగతించిన నితీశ్‌కుమార్**

కులగణన చేపట్టాలన్న నిర్ణయాన్ని సీఎం నితీశ్‌కుమార్ స్వాగతించారు. తాము ఎప్పటినుంచే ఈ డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కులగణన ద్వారా ఆయా వర్గాలలోని ప్రజల సంఖ్య వెల్లడవుతుందని, తద్వారా వారి అభ్యున్నతికి, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని అభిప్రాయపడ్డారు. బీహార్ ప్రభుత్వం 2023 అక్టోబర్‌లోనే తమ రాష్ట్రానికి సంబంధించిన కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు కులగణనపై నిర్ణయం తీసుకున్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.


## పాక్ ప్రభుత్వ భద్రతలో దర్జాగా హఫీజ్ సయీద్

### ఇంటి ముందు గార్డులు, ఇంటి కింద బంకర్

న్యూఢిల్లీ: లష్కర్ తాయిబానా? ఆ సంస్థ ఉనికే మా దేశంలో లేదు. ఇక ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) సంస్థ పేరు కూడా ఎక్కడా వినలేదు. అంటూ రెండు రోజుల క్రితం అంతర్జాతీయ మీడియా సమక్షంలో నిస్సిగ్గుగా అబద్ధమాడేశారు పాకిస్థాన్ మంత్రి ఒకరు. అయితే పహల్గాంలో పర్యాటకులపై పాశవిక దాడి వెనుక లష్కర్ తాయిబా హస్తం ఉన్నట్టు ఇప్పటికే పలు కథనాలు వెలువడ్డాయి. ఈ దాడి తామే చేశామంటూ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించినా దాని వెనుక ప్రధాన హస్తం లష్కరే తాయిబాదే. దాని చీఫ్, భారత్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్‌యే ఈ దాడికి సూత్రధారి అని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో హఫీజ్ పాక్‌లో ప్రభుత్వ భద్రత మధ్య బహిరంగంగా దర్జాగా జీవిస్తున్నట్టు ఒక ఆంగ్ల మీడియా తన కథనంలో పేర్కొంది. హఫీజ్ సయీద్ లాహోర్‌లోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీ ప్రదేశంలో సామాన్య పౌరులతో కలిసి జీవిస్తున్నట్టు తెలిసింది.

## 24-36 గంటల్లో భారత్ సైనిక చర్య!

- విశ్వసనీయ నిఘా సమాచారం ఉందన్న పాక్
- దాడి చేస్తే తీవ్ర చర్యలు తప్పవని భారత్‌కు హెచ్చరిక
- యుద్ధం అవకాశాలు క్షణం క్షణం పెరుగుతున్నాయన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి



ఇస్లామాబాద్, ఏప్రిల్ 30: ఒక పక్క భారత్ ఎప్పుడు సైనిక దాడికి దిగుతుందోనని భయంతో వణుకుతూనే మరో పక్క అలా చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పాకిస్థాన్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నది. 'మాకు అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం భారత్ రానున్న 24-36 గంటల్లో సైనిక చర్యకి దిగుతుంది. అదే కనుక జరిగితే న్యూఢిల్లీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు' అని బుధవారం పాకిస్థాన్ ఒక ప్రకటనలో హెచ్చరించింది. దాడి చేసే విధానం, సమయం, లక్ష్యాలను నిర్ణయించే 'పూర్తి స్వేచ్ఛ' త్రివిధ దళాలకు ఇస్తూ ప్రధాని మోదీ మంగళవారం ఆదేశాలు ఇచ్చిన క్రమంలో పాకిస్థాన్ ఈ ప్రకటన చేసింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, సమయం గడుస్తున్నకొద్దీ యుద్ధం వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి కానీ తగ్గడం లేదని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ చెప్పారు. పార్లమెంటు వెలుపల బుధవారం ఆయనను విలేకర్ల ప్రశ్నించిపుడు ఆయన ఈ విధంగా స్పందించారు. భారత దేశం ఉల్లంఘనకు పాల్పడితే, తాము దీటుగా ప్రతిస్పందిస్తామని చెప్పారు. భారత్ చర్యను బట్టి తమ స్పందన ఉంటుందని, భారత్ చర్య కన్నా భారీగా ఉంటుందని అన్నారు. పాకిస్థాన్ స్పందన గురించి ఎటువంటి సందేహం అక్కర్లేదన్నారు. భారత్ వివేకంతో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

# సూపర్ క్యాబినెట్ భేటీ

> మొదటిపేజీ తరువాయి...

సూపర్ క్యాబినెట్ సమావేశం కావడం ఇదే తొలిసారి. ఈ కమిటీలో కేంద్ర క్యాబినెట్‌లోని టాప్ మంత్రులు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుత సీసీపీఏలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఉన్నారు.

**పాక్‌పై మరిన్ని చర్యలు?**

2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై జరిగిన ఉగ్రదాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఘటనపై ప్రతీకార చర్యలు చేపట్టడంపై చర్చించేందుకు సీసీపీఏ సమావేశమైంది. కొన్ని రోజుల తర్వాత ఫిబ్రవరి 26న భారత వాయుసేన పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్ర శిబిరాలపై దాడుల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడి తర్వాత సీసీపీఏ సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఉగ్రదాడికి ప్రతీకారంగా ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్నదానిపై ఆసక్తి నెలకొంది. మంగళవారం ప్రధాని తన గృహంలో నిర్వహించిన అత్యున్నత స్థాయి సమావేశం తర్వాత బుధవారం సైతం వరుస సమావేశాలు నిర్వహించడం చూస్తుంటే పాకిస్థాన్‌పై యుద్ధానికి సంబంధించి కీలకమైన నిర్ణయాలు తీసుకుని ఉంటారని భావిస్తున్నారు. సీమాంతర ఉగ్రవాదం, దాన్ని సూత్రధారులపై ఎప్పుడు, ఎలా చర్యలు తీసుకోవాలన్నదానిపై సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే.

### పాక్ విమానాలకు భారత గగనతలం మూసివేత

**తక్షణం అమలులోకి.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం**



న్యూఢిల్లీ: పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను భారత్ అష్ట దిగ్బంధం చేస్తున్నది. తాజాగా పాక్‌కు చెందిన విమానాలు భారత గగనతలంలోకి రాకుండా ఆంక్షలు విధించింది. ఇప్పటికే పాక్ తన గగనతలాన్ని మూసివేసి భారత్ విమానాలకు ప్రవేశం లేకుండా అడ్డుకుంది. దీనికి ప్రతీకారంగా భారత్ కూడా పాకిస్థాన్‌కు చెందిన, దాని ఆధ్వర్యంలో నడుస్తున్న, ఆ దేశం లీజుకు తీసుకున్న వాణిజ్య విమానాలతో పాటు మిలిటరీ విమానాలకు తమ గగనతలంలో ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు అమలులో ఉంటాయని తెలిపింది. భారత్ విధించిన ఈ ఆంక్షలతో కౌలాలంపూర్ లాంటి ఆగ్నేయ ప్రాంతాలకు వెళ్లే పాకిస్థాన్ విమానాలు చైనా, శ్రీలంక లాంటి దేశాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.



## జాతీయ భద్రతా సలహా బోర్డు చైర్మన్‌గా అలోక్ జోషి

### రా మాజీ చీఫ్‌ని నియమించిన కేంద్రం

న్యూఢిల్లీ: పహల్గాం దాడి అనంతరం పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని ఉన్న క్రమంలో కేంద్రం నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు (ఎన్‌ఎస్‌ఏబీ)ని పునర్వ్యవస్థీకరించింది. రా మాజీ చీఫ్ అలోక్ జోషిని ఎన్‌ఎస్‌ఏబీ హెడ్‌గా నియమించింది. ఇక నుంచి ఎన్‌ఎస్‌ఏబీలో ఆరుగురు సభ్యులుంటారు. అందులో ముగ్గురు మిలిటరీ నేపథ్యం కలిగిన వారు, ఇద్దరు ఐపీఎస్‌లు, ఒకరు ఐఎఫ్‌ఎస్ ఉంటారు. మిలిటరీ నుంచి సదరన్ ఆర్మీ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, మాజీ వెస్టర్న్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, రేర్ అడ్మిరల్ మాంటీ ఖన్నాలను నియమించారు. అలాగే రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి బీ వెంకటేశ్ వర్మలతో బోర్డును ఏర్పాటు చేశారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా పాక్‌పై చర్యలకు సిద్ధమవుతున్న క్రమంలో ఈ నియామకం జరిగింది.

## పహల్గాం దాడిలో ఫరూఖ్ నెట్‌వర్క్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్విస్టిగేసన్ ఏజెన్సీ పురోగతి సాధించింది. ఈ దాడికి సంబంధించి ప్రమేయం ఉన్న వారిలో లష్కరే తాయిబా (ఎల్‌ఈటీ)కి చెందిన ఫరూఖ్ అహ్మద్‌ను ముఖ్యుడిగా గుర్తించింది. ఈ నెల 22న పహల్గాం దాడి కేసులో ఉగ్రవాదులకు లాజిస్టికల్ సహాయం అందించిన ఓవర్‌గ్రౌండ్ వర్కర్స్ (ఓజీడబ్ల్యూస్) విస్తృత నెట్‌వర్క్‌ను ఫరూఖ్‌యే స్థాపించాడని భావిస్తున్నారు. కశ్మీర్‌లోని కుప్వారాకు చెందిన ఫరూఖ్ ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నాడు. ఉగ్రవాదులు పాకిస్థాన్ సరిహద్దు గుండా మూడు వేర్వేరు సెక్టార్ల ద్వారా కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి సహాయపడటంలో ఫరూఖ్ కీలక పాత్ర పోషించాడు.

## పాకిస్థానీ నటికి భారత అభిమానుల వాటర్ బాటిల్స్

న్యూఢిల్లీ: భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నడుమ పాకిస్థానీ నటి హానియా ఆమిర్‌కు ఇండియన్ ఫ్యాన్స్ వాటర్ బాటిళ్లను పంపిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతున్నది. ఈ వీడియోలో కొందరు యువకులు కొన్ని వాటర్ బాటిళ్లను ఓ పెట్టెలో ఉంచి ప్యాకింగ్ చేస్తున్నట్లు కనిపించింది. ఆ పెట్టె పైన 'టు హానియా ఆమిర్, రావల్పిండి, పంజాబ్, పాకిస్థాన్. ఫ్రమ్ ఇండియా' అని రాసి ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం పాకిస్థాన్‌పై చర్యల్లో భాగంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం సస్పెండ్ చేసింది. భారత్ నుంచి వెళ్లే జలాలు పాక్‌లోని 80 శాతం సాగు భూములకు ఆధారం.



## పీవోకే స్వాధీనమే పరిష్కారం

### భారత సంతతి బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘ్‌నాథ్ దేశాయ్

న్యూఢిల్లీ: సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించడం కోసం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి బ్రిటన్ ఎంపీ లార్డ్ మేఘ్‌నాథ్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఆయన గుజరాత్‌లోని వడోదరలో జన్మించారు. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఆయన మంగళవారం న్యూఢిల్లీలో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ, దోషులకు శిక్ష పడే విధంగా భారత దేశం కచ్చితంగా బలంగా స్పందించాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా సమాధానం చెప్పాలని తెలిపారు. పహల్గాం దాడి అత్యంత క్రూరమైనదన్నారు. జమ్ము కశ్మీరును భారత దేశంలో కలిపేందుకు సమ్మతిస్తూ మహారాజు లేఖ ఇచ్చారని, అందువల్ల పీవోకే మనదేనని తెలిపారు. దేశాయ్ బ్రిటన్ పార్లమెంటులోని లార్డ్స్ సభ సభ్యుడు.

# వరుసగా ఆరో రోజూ పాక్ కాల్పులు

- ఎల్వోసీ, ఐబీ వెంబడి ఫైరింగ్
- సమర్థంగా తిప్పికొట్టిన భారత భద్రతా బలగాలు
- కాల్పులపై పాకిస్థాన్‌కు భారత్ గట్టి వార్నింగ్



న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి పాకిస్థాన్ ఏకపక్షంగా కాల్పులకు తెగబడుతున్నది. వరుసగా ఆరో రోజు బుధవారం రాత్రి నాలుగు జిల్లాల్లోని వివిధ సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు జరిపిందని, వీటిని భారత సైన్యం దీటుగా తిప్పికొట్టిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. జమ్ములోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి, రాజౌరీ జిల్లాలోని సుందరబానీ, నౌషార సెక్టార్లలో, కశ్మీర్‌లోని బారాముల్లా, కుప్వారాలో భారత్ సైనిక పోస్టులే లక్ష్యంగా పాక్ ఆర్మీ కాల్పులు జరిపిందని తెలిపింది. 2003 నాటి కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరిస్తూ భారత్-పాక్ మధ్య ఫిబ్రవరి 2021లో అంగీకారం కుదిరింది. అయితే దీనిని పాక్ ఏకపక్షంగా ఉల్లంఘిస్తూ, వరుసగా ఆరో రోజు రాత్రి భారత్ సైన్యంపై కాల్పులు జరిపినట్టు అధికారులు వెల్లడించారు. ఇరు దేశాలను విడదీస్తూ గుజరాత్ నుంచి జమ్ములోని అఖ్నూర్ వరకు 3,323 కిలోమీటర్ల వెంబడి భారత్ సరిహద్దును కలిగి ఉంది. ఇందులో అంతర్జాతీయ సరిహద్దు 2,400 కిలోమీటర్లుగా, 740 కిలోమీటర్లు ఎల్వోసీ (నియంత్రణ రేఖ)గా ఉంది. కాల్పుల విరమణ ఒప్పందానికి పాక్ తూట్లు పొడవడంపై భారత్ హెచ్చరికలు జారీచేసింది. ఇరు దేశాలకు చెందిన మిలిటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరళ్లు హాట్ లైన్ ద్వారా మాట్లాడుకున్నారని, పాక్ కాల్పులకు తెగబడుతుండటంపై భారత్ వార్నింగ్ ఇచ్చినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు.

**పీవోకేకు విమానాలు రద్దు**

పాక్ ఆక్రమిత కశ్మీరు మీదుగా ప్రయాణించే విమానాలను పాకిస్థాన్ బుధవారం రద్దు చేసింది. గిల్గిట్, స్కర్దు, ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే విమానాలను రద్దు చేసినట్లు పాక్ మీడియా వెల్లడించింది. కరాచీ, లాహోర్‌ల నుంచి స్కర్దుకు వెళ్లే రెండు విమానాలను, ఇస్లామాబాద్ నుంచి స్కర్దు, గిల్గిట్ వెళ్లే విమానాలను రద్దు చేసినట్లు తెలిపింది.

## మహిళా ప్రజాప్రతినిధుల్లో 28% మంది నేరచరితులే!

### ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా వెల్లడించిన ఏడీఆర్



న్యూఢిల్లీ: మన దేశంలోని మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 17 మంది బిలియనీర్లు, 28% మంది నేరచరితులు ఉన్నట్టు అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ప్రకటించింది. లోక్‌సభలోని 75 మంది మహిళా ఎంపీల్లో ఆరుగురు, రాజ్యసభలోని 37 మంది మహిళా ఎంపీల్లో ముగ్గురు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లోని 400 మంది మహిళా ఎమ్మెల్యేల్లో 8 మంది తమను తాము బిలియనీర్లుగా ప్రకటించుకున్నట్టు వెల్లడించింది. మొత్తం 513 మంది మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 512 మంది ఎన్నికల అఫిడవిట్లు సమర్పించారని, వారిలో 143 (28 శాతం) మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు ప్రకటించారని తెలిపింది. లోక్‌సభ మహిళా ఎంపీల్లో 24 (32 శాతం) మంది, రాజ్యసభ మహిళా ఎంపీల్లో 10 (27 శాతం) మంది, మహిళా ఎమ్మెల్యేల్లో 109 (27 శాతం) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 78 మంది మహిళా చట్టసభ సభ్యులు హత్య, హత్యాయత్నం లాంటి తీవ్రమైన నేరారోపణలను ఎదుర్కొంటున్నారని, వారిలో 14 మంది లోక్‌సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 57 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్టు పేర్కొన్నది.

**మహిళా నేరచరితులు**

| రాష్ట్రం | మహిళా ఎమ్మెల్యేలు/ ఎంపీలు | నేరచరితులు | % |
|---|---|---|---|
| గోవా | 3 | 2 | 67 |
| తెలంగాణ | 12 | 8 | 67 |
| ఆంధ్రప్రదేశ్ | 24 | 14 | 58 |
| పంజాబ్ | 14 | 7 | 50 |
| కేరళ | 14 | 7 | 50 |
| బీహార్ | 35 | 15 | 43 |

**పార్టీలవారీగా మహిళా నేరచరితులు**

| పార్టీ | మొత్తం మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య | నేరచరితులు | తీవ్రనేర అభియోగాలున్నవారు |
|---|---|---|---|
| బీజేపీ | 217 | 23% | 11% |
| కాంగ్రెస్ | 83 | 34% | 20% |
| టీడీపీ | 20 | 65% | 45% |
| ఆప్ | 13 | 69% | 31% |

## అమూల్ పాల ధర లీటరుకు రూ.2 పెంపు

అహ్మదాబాద్: దేశవ్యాప్తంగా అమూల్ పాల ధరలను గురువారం నుంచి లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రకటించింది. అన్ని రకాల అమూల్ మిల్క్ వేరియంట్లకు ఇది వర్తిస్తుందని చెప్పింది. దీంతో గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)లో 3-4 శాతం పెరుగుతుందని తెలిపింది. ఇది సగటు ఆహార ద్రవ్యోల్బణం కన్నా చాలా తక్కువ అని పేర్కొంది.

## భారత్ వీడిన 786 మంది పాకిస్థానీయులు

### పాక్ నుంచి స్వదేశానికి 1,465 మంది భారతీయులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌లో తాత్కాలిక వీసాలపై ఉన్న పాకిస్థాన్ పౌరులు వెంటనే దేశం విడిచివెళ్లాలంటూ భారత్ విధించిన డెడ్‌లైన్ మంగళవారంతో ముగిసింది. భారత్ విధించిన ఆంక్షల నేపథ్యంలో గత ఆరు రోజుల్లో 786 మంది పాకిస్థానీయులు అటారీ-వాఘా సరిహద్దు గుండా భారత్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. వీరిలో 55 మంది దౌత్యవేత్తలు, వారి కుటుంబ సభ్యులు, సహాయ సిబ్బందితో పాటు పాకిస్థాన్ వీసా ఉన్న 8 మంది భారతీయులు కూడా ఉన్నారు. అదే సమయంలో ఈ నెల 24 నుంచి 1,465 మంది భారత్‌కు చేరుకున్నారు. వీరిలో 25 మంది దౌత్యవేత్తలు, అధికారులతో పాటు దీర్ఘకాలిక భారత వీసా కలిగి ఉన్న 151 మంది పాకిస్థాన్ పౌరులు ఉన్నారు.

## ఆర్బిట్రల్ అవార్డులను కోర్టులు సవరించవచ్చు

### సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ : వ్యాపార వివాదాల్లో ట్రిబ్యునళ్లు ఇచ్చే ఆర్బిట్రల్ అవార్డులను సవరించే అధికారం కోర్టులకు ఉందని సుప్రీంకోర్టు బుధవారం 4:1 మెజారిటీ తీర్పు చెప్పింది. మధ్యవర్తిత్వం, రాజీ చట్టం, 1996 ప్రకారం ఆర్బిట్రల్ అవార్డులను కొన్ని పరిస్థితుల్లో సవరించవచ్చునని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జి మసీహ్ ఇచ్చిన రూలింగ్‌లో చెప్పారు. అయితే, ఆర్బిట్రల్ అవార్డులను సవరించేటపుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సీజేఐ చెప్పారు. వీటిని సవరించేందుకు రాజ్యాంగంలోని అధికరణ 142 ప్రకారం సుప్రీంకోర్టుకు లభించిన ప్రత్యేక అధికారాలను వర్తింపజేయవచ్చునని తెలిపారు. చెల్లుబాటయ్యే దానిని, చెల్లుబాటు కాని దానిని వేరు చేయగలిగినపుడు, తప్పుగా కనిపించే క్లరికల్, కంప్యూటేషన్ లేదా టైపోగ్రాఫికల్ తప్పులను సరిదిద్దేందుకు ఈ అధికారాన్ని వినియోగించవచ్చునని తెలిపారు. ఈ తీర్పునిచ్చిన ధర్మాసనంలోని జస్టిస్ కేవీ విశ్వనాథన్ మాత్రం ఆర్బిట్రల్ అవార్డులను సవరించే అధికారం కోర్టులకు లేదని పేర్కొన్నారు.



## చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

### గంగోత్రి, యమునోత్రి ఆలయాల్లో భక్తుల పూజలు

డెహ్రాడూన్: చార్‌ధామ్ యాత్ర బుధవారం ప్రారంభమైంది. గర్వాల్ హిమాలయాల్లోని గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను అక్షయ తృతీయ సందర్భంగా తెరిచారు. భక్తులు గంగా మాత, యమునా మాతలను దర్శించుకున్నారు. చార్‌ధామ్ యాత్రలో, కేదార్‌నాథ్ దేవాలయాన్ని మే 2న, బద్రీనాథ్ దేవాలయాన్ని మే 4న తెరుస్తారు. శీతాకాలంలో ఈ నాలుగు దేవాలయాలను మూసివేస్తారు. భక్తుల భద్రత కోసం యాత్ర మార్గాల్లో దాదాపు 6,000 మంది పోలీసులు, 17 కంపెనీల ప్రొవిన్షియల్ ఆర్మ్‌డ్ కానిస్టేబులరీ సిబ్బంది, 10 కంపెనీల పారామిలిటరీ దళాలను మోహరించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 65కుపైగా ప్రాంతాల్లో రాష్ట్ర విపత్తు స్పందన దళ సిబ్బందిని మోహరించారు.



## మేలో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు

### భారత వాతావరణ శాఖ అంచనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఈసారి మే నెలలో దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. తెలంగాణ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో వేడి గాలులు వీచే రోజులు సాధారణం కన్నా ఎక్కువగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. అయితే, మే నెలలో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానల వల్ల ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరకుండా ఆగుతాయని ఐఎండీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

# నేటి నుంచి ఏటీఎం చార్జీల పెంపు

- వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు స్లీపర్, ఏసీ బోగీల్లోకి అనుమతి ఉండదు
- నేటి నుంచి వచ్చే మార్పులివే

న్యూఢిల్లీ: ఈ నెల 1 నుంచి పలు కీలక మార్పులు రాబోతున్నాయి. ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ రుసుములు పెరుగుతాయి. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఇటీవల రెపో రేటును తగ్గించినందువల్ల గృహ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గుతాయి. 11 రాష్ట్రాల్లో బ్యాంకుల విలీనం ప్రభావం పడుతుంది.

**ఏటీఎం ఫీజు**

ఏటీఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజును మే 1 నుంచి పెంచడానికి ఆర్బీఐ ఆమోదం తెలిపింది. ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ, బ్యాలన్స్ చెక్, పిన్ ఛేంజ్ వంటి లావాదేవీలకు నెలవారీ పరిమితులు ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిమితికి మించిన ప్రతి లావాదేవీకి ప్రస్తుతం రూ.21 వసూలు చేస్తున్నారు. దీనిని మే 1 నుంచి రూ.23కు పెంచారు. .

**రైల్వే టికెట్లు**

వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న టికెట్లతో ప్రయాణికులు మే 1 నుంచి స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణించరాదని భారతీయ రైల్వే ప్రకటించింది. వీరు జనరల్ బోగీల్లో ప్రయాణించవచ్చునని చెప్పింది. క్యాన్సిలేషన్ రిఫండ్ సమయాన్ని 2 రోజులకు తగ్గించింది.

**ఆదాయపు పన్ను రిటర్నులు**

ఆదాయపు పన్ను శాఖ ఏప్రిల్ 30న ఐటీఆర్ ఫారం 1, 4లను విడుదల చేసింది. సంవత్సరానికి రూ.50 లక్షల కన్నా తక్కువ ఆదాయం గల వ్యక్తులు, సంస్థలు తమ ఐటీ రిటర్నులను మే నెలలో దాఖలు చేయవచ్చు.

**బ్యాంకుల విలీనం**

'ఒక రాష్ట్రం-ఒకే ఆర్‌ఆర్‌బీ' విధానం మే 1 నుంచి అమల్లోకి వస్తుంది. 11 రాష్ట్రాల్లోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 'ఒక రాష్ట్రానికి ఒకే ఆర్‌ఆర్‌బీ'గా విలీనమవుతాయి.

## దివ్యాంగులకు అనుకూలంగా ఈ-కేవైసీలో మార్పులు

### సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ సేవలు, సంక్షేమ పథకాలు వంటివాటిని దివ్యాంగులు పొందడానికి వీలుగా డిజిటల్ కేవైసీ ప్రక్రియలో మార్పులు చేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. యాసిడ్ దాడుల బాధితులు, దృష్టి సంబంధిత వైకల్యాలతో బాధపడేవారికి అనుకూలంగా ఈ మార్పులు ఉండాలని తెలిపింది. భారతీయ రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం, దానిలోని డిపార్ట్‌మెంట్లకు ఈ ఆదేశాలను జారీ చేసింది. జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కులలో ముఖ్యమైన భాగంగా డిజిటల్ యాక్సెస్ హక్కు ఆవిర్భవించిందని తెలిపింది.